క్లుప్తంగా

విజేతలకు అభినందన



బాక్సింగ్‌లో విజేతలను అభినందిస్తున్న కోచ్

మల్కాపురం: ఇటీవల నగరంలో జరిగిన బాక్సింగ్ పోటీల్లో విజేతలుగా నిలిచిన కల్పిత, హర్షితలను గురువారం కోచ్ వెంకటేశ్వరరావు అభినందించారు. శ్రీహరిపురం ప్రాంతానికి చెందిన కల్పిత,హర్షితలు రైల్వే స్టేడియం వద్ద ఇటీవల జరిగిన బాలికల 45 నుంచి 50 కిలోల విభాగ బాక్సింగ్ పోటీల్లో విజేతలుగా నిలిచారు. దీంతో వీరిద్దరినీ కోచ్ వేంకటేశ్వరరావుతో పాటు షేక్ అలీ,ఉపేంద్ర,సునీల్ తదితరులు అభినందించారు.

విజయగౌరికి మొదటి ప్రాధాన్యం ఇవ్వండి



కార్యక్రమంలో మాట్లాడుతున్న అజశర్మ

మల్కాపురం: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా బరిలో ఉన్న కోరెడ్ల విజయగౌరికి మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ కోరారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం కార్యక్రమంలో భాగంగా యూటీఎఫ్ బలపరిచిన పి.డి.ఎఫ్ అభ్యర్థి విజయగౌరిని గెలిపించాలని కోరుతూ గురువారం శ్రీహరిపురం,మల్కాపురం ప్రాంతాల్లోని ప్రభుత్వ,ప్రైవేట్ పాఠశాల ఉపాధ్యాయులను కలిసి అభ్యర్థించారు.కార్యక్రమంలో సీఐటీయూ మల్కాపురం జోన్ నాయకుడు ఆర్.లక్ష్మణమూర్తి,పెంటారావు,సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

సిటీపోలీస్ జట్టు విజయం



సిటీ పోలీసు జట్టు విజయంలో కీలక పాత్ర పోషించిన క్రీడాకారులు త్రినాథ్, శివకేశవ

మల్కాపురం: వీడీసీఏ ఇన్‌స్టిట్యూషన్స్ లీగ్‌లో భాగంగా జింక్‌గ్రౌండ్‌లో గురువారం జరిగిన మ్యాచ్‌లో ఇన్‌కమ్ ట్యాక్స్ జట్టుపై సిటీపోలీస్ జట్టు ఆరువికెట్ల తేడాతో విజయం సాధించింది.తొలుత బ్యాటింగ్ చేసిన ఇన్‌కమ్‌ట్యాక్స్ జట్టు నిర్ణీత 18 ఓవర్లలో తొమ్మిది వికెట్లు కోల్పోయి 120 పరుగులు చేసింది.రాజేంద్ర 23 పరుగులు చేశాడు. కేశవ మూడు, శ్రీను,అప్పన్న చెరో రెండేసి వికెట్లు తీశారు. ప్రతిగా సిటీపోలీస్ నాలుగు వికెట్లు కోల్పోయి 12.3 ఓవర్లలోనే విజయలక్ష్మానికి చేరింది. సంతోష్ 26 పరుగులు చేయగా త్రినాథ్ 50 పరుగులతో నిలిచాడు.

ఫుట్‌పాత్‌లపై ఆక్రమణల తొలగింపు



మల్కాపురంలో ఫుట్‌పాత్‌పై ఆక్రమణలను తొలగిస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ అప్పారావు

మల్కాపురం: మల్కాపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌లను ఆక్రమించి నిర్వహిస్తున్న దుకాణాలను గురువారం ట్రాఫిక్ ఎస్ఐ అప్పారావు సిబ్బందితో కలిసి తొలగించారు. మల్కాపురం, శ్రీహరిపురం ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌లపై దుకాణాలు ఏర్పాటు చేయడం వల్ల పాదచారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. మరోసారి ఫుట్‌పాత్‌పై దుకాణాలు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఏయూలో ఎన్ఎస్‌యూ ఫ్లోరిడా ప్రతినిధులు

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని నోవా సౌత్ ఈస్టన్ యూనివర్సిటీ (ఎన్.ఎస్.యు) అసిస్టెంట్ డైరెక్టర్, జోసెఫ్ స్లిబాతో కూడిన బృందం గురువారం సందర్శించింది. రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావుతో కార్యాలయంలో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రెండు విశ్వవిద్యాలయాల్లో నిర్వహిస్తున్న నూతన కోర్సులు ప్రత్యేకమైన అంశాలను పరస్పరం వివరించారు.

నాడు నగర వాసులకు ఆహ్లాదంతో పాటు ఆనందం పంచాలనే లక్ష్యంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పచ్చదనానికి పెద్దపీట వేసింది. పిచ్చి మొక్కలు, ఆక్రమణలకు గురైన గ్రీన్‌బెల్ట్‌ను నందన వనాల్లా తీర్చిదిద్దింది. ప్రజలు వ్యాయామం చేసుకోవడానికి వీలుగా వాటిల్లో ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేసింది. వాకింగ్ ట్రాక్‌లు నిర్మించింది. దీంతో చిన్నా పెద్దా అన్న తేడా లేకుండా అంతా ఉత్సాహంగా గడిపేవారు.

నేడు కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఓపెన్ జిమ్‌లు, గ్రీన్ బెల్ట్ నిర్వహణను గాలికి వదిలేసింది. ఆక్రమణకు గురవుతున్నా పట్టనట్టు వ్యవహరిస్తోంది. ఓపెన్ జిమ్‌లలో పిచ్చిమొక్కలు పెరిగి అధ్వానంగా మారినా అటు వైపు చూడడం లేదు. పరిసరాలు అధ్వానంగా మారడంతో ప్రజలకు ఆహ్లాదం కరువైంది. జిమ్‌లలో ఏర్పాటు చేసిన పరికరాలు తుప్పపట్టిపోతున్నాయి.

ఆహ్లాదానికి చోటేది?

గ్రీన్‌బెల్ట్, ఓపెన్ జిమ్‌ల నిర్వహణ గాలికి

- తుప్పపడుతున్న పరికరాలు
- వ్యర్థాలతో నిండిన పరిసరాలు
- కూతవేటు దూరంలో సచివాలయం
- అయినా పట్టించుకోని వైనం



దయానందనగర్‌లో అలంకారప్రాయంగా ఓపెన్ జిమ్ పరికరాలు



చెత్తా చెదారాలతో సచివాలయ ఆవరణ



ఓపెన్ జిమ్ పరికరాల వద్ద వేసిన కర్రలు, వ్యర్థాలు

కంచరపాలెం: జీవీఎంసీ 56వ వార్డు కంచరపాలెం పరిధిలోని దయానందనగర్, ముత్యమాంబకాలనీ, రాజీవ్‌కాలనీ, చాకలిగెడ్డ ప్రాంతాల్లో ఓపెన్ జిమ్‌లు మూలకు చేరాయి. కంచరపాలెం ప్రాంత ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని గత ప్రభుత్వం రామ్మూర్తిపంతులుపేట, గవర కంచరపాలెం, దయానందనగర్ ప్రాంతాల్లో ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేసింది. దయానందనగర్ సచివాలయానికి ఆనుకుని ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ వద్ద కట్టెలు, ఇతర సామగ్రి వేయడంతో వాకర్స్ ఇబ్బందులు పడుతున్నారు. రాజీవ్‌కాలనీ, చాకలిగెడ్డ1,2, దయానందనగర్, ముత్యమాంబకాలనీ, పైడిమాంబకాలనీ తదితర కాలనీ వాసులు నిత్యం ఇక్కడే వ్యాయామం చేసేవారు. ప్రస్తుతం నిరుపయోగంగా మారాయి. పరికరాలు తుప్పు పట్టి, పరిసరాలు చెత్తచెదారాలతో నిండి అధ్వానంగా ఉన్నాయి.

కానరాని నిర్వహణ

దయానందనగర్‌లో ఓపెన్ జిమ్‌కు సరైన రక్షణ లేకపోవడంతో వాహనాలు పార్కింగ్ చేసేందుకు నిత్యం వినియోగిస్తున్నారు. చీకటి పడితే కమ్యూనిటీ హాల్, సచివాలయం ప్రాంతాల్లో ఆకతాయిల ఆగడాలు శృతి మించుతున్నాయి. బయట నుంచి వచ్చే వ్యక్తులు ధూమపానం, మద్యం సేవిస్తున్నారు. ఓపెన్ జిమ్‌లలో పరికరాలు పోతున్నాయని.. ఆకతాయిలు పాడు చేస్తున్నారని స్థానిక సచివాలయాల్లో ఫిర్యాదులు చేసినా పట్టించుకునే నాథుడు కరువయ్యారని స్థానికులు చెబుతున్నారు. కూటమి ప్రభుత్వంలో ప్రతి కార్యకర్త నాయకుడిలా చలామణి అవుతుండడంతో సమస్యలు ఎవరికి చెప్పినా పరిష్కారం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అధికారులు స్పందించాలి

ఓపెన్ జిమ్‌ల నిర్వహణను గాలికి వదిలేయడంతో అధ్వానంగా మారాయి. వ్యాయామం చేసేందుకు ఇబ్బంది పడుతున్నాం. వాకింగ్ ట్రాక్ నిర్మిస్తే బాగుంటుంది. ఓపెన్ జిమ్‌కు రక్షణ చర్యలు చేపట్టాలి. ఫిర్యాదులు చేసినా పట్టించు సిబ్బంది పట్టించు కోవడం లేదు. సంబంధిత ఉన్నాధికారులు అధికారులు స్పందించి ఓపెన్ జిమ్‌లు, గ్రీన్ బెల్ట్ నిర్వహణపై దృష్టిసారించాలి.

– పి. వెంకటేష్, చాకలిగెడ్డ, కంచరపాలెం.

జిమ్ పరికరాలకు రక్షణ కల్పించాలి

ఓపెన్ జిమ్ నిరుపయోగంగా మారింది. పరిసరాలు వ్యర్థాలతో నిండి దుర్గంధభరితంగా మారాయి. వ్యాయం చేద్దామంటే ఆరోగ్యం మాట ఎలా ఉన్నా అనారోగ్యం గ్యారంటీగా వచ్చేటట్టుంది. జిమ్ పరికరాలకు రక్షణ కల్పించాలి. జిమ్‌ను శుభ్రం చేసి అందరికీ వినియోగంలోకి తెవాలి.

–బి. సంతోష్‌కుమార్, దయానందనగర్, కంచరపాలెం.



వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీలో ‘పశ్చిమ’ నేతలు



గల్ల శ్రీనివాసరావు జిల్లా ఉపాధ్యక్షుడు



బీఎస్ కృష్ణ(ఆల్ఫా కృష్ణ) పార్టీ స్పోక్స్ పర్సన్



బాకి శ్యామ్‌కుమార్ రెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి



ఉమా మహేశ్వరరావు ఆర్గనైజింగ్ సెక్రటరీ



శ్రీనివాసరావు యాక్టివిటీ సెక్రటరీ



పల్లా ఎర్నికుమార్ యాక్టివిటీ సెక్రటరీ

గోపాలపట్నం: వైఎస్సార్ సీపీ విశాఖ జిల్లా కమిటీ ఏర్పాటైంది. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ జిల్లా కమిటీలో వివిధ హోదాల్లో విశాఖ పశ్చిమ నియోజకవర్గానికి చెందిన పలువురిని నియమించారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. జిల్లా కమిటీలో నియోజకవర్గానికి చెందిన ఏడుగురి నాయకులకు చోటు కల్పించడంపై సంతోషం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడిగా గల్ల శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా బాకి శ్యామ్‌కుమార్ రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా గుణుపురపు లక్ష్మీ వెంకట నరేష్, కొణతాల ఉమామహేశ్వరరావు, యాక్టివిటీ సెక్రటరీలుగా చిట్టిమిరెడ్డి శ్రీనివాస్, పల్లా ఎర్నికుమార్, అఫీసియల్ స్పోక్స్‌పర్సన్‌గా బి. సన్నికృష్ణ(ఆల్ఫాకృష్ణ) నియమితులయ్యారు.

పారిశుధ్య కార్మికులను పర్మినెంట్ చేయాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న లక్ష్మణమూర్తి

మల్కాపురం: పారిశుధ్య కార్మికులను పాలకులు చులకనగా చూడడం బాధాకరమని సీఐటీయూ నాయకుడు ఆర్.లక్ష్మణమూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. జీవీఎంసీ 58,59,60వ వార్డుల పారిశుధ్య కార్మికులతో గురువారం సమావేశం అయ్యారు. గుల్లలపాలెం వద్ద జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నగరం పరిశుభ్రంగా ఉండేందుకు, ప్రజలు ఆరోగ్యంగా ఉండేందుకు రాత్రి, పగలు అన్న తేడా లేకుండా పని చేస్తున్న పారిశుధ్య కార్మికులను పర్మినెంట్ చేయడంలో పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. చాలా మంది పారిశుధ్య కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్ వంటి సౌకర్యాలు సక్రమంగా లేవన్నారు. ప్రతి కార్మికుడి సర్వీసును 60 నుంచి 62 ఏళ్లకు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు, కార్మికులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన



గోపాలపట్నం బంక్ వద్ద ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ విజయ్ కుమార్

గోపాలపట్నం: రహదారి భద్రతపై అందరూ అవగాహన పెంచుకోవాలని గోపాలపట్నం ట్రాఫిక్ ఎస్ఐ విజయ్ కుమార్ తెలిపారు. రహదారి భద్రతా మాసోత్సవాల సందర్భంగా గురువారం గోపాలపట్నం బంక్ జంక్షన్‌లో వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బ్యానర్లు, ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహన చోదకులు ప్రయాణించినపుడు భద్రతా నియమాలు పాటించాలన్నారు. వన్‌వేకు వ్యతిరేకంగా ప్రయాణించడం ప్రమాదకర మన్నారు. హెల్మెట్ లేకుండా, సీటు బెల్టు పెట్టుకోకుండా వాహనాలు నడపరాదని తెలిపారు. హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనం నడిపితే రూ.1035 జరిమానాతో పాటు 3 నెలలు లైసెన్సు రద్దు చేస్తామన్నారు. అతి వేగం, జిగ్‌జాగ్ డ్రైవింగ్ చేయడం ప్రాణాంతకమని హెచ్చరించారు. ఫుట్‌పాత్‌లు పాదచారులు నడిచేందుకు నిర్మించారని.. వాటిని ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

అనుమానాస్పదంగా మహిళ మృతి

నేవల్ క్వార్టర్స్‌లో ఘటన

మల్కాపురం: మూడు రోజుల నుంచి తలుపు తెరవని ఓ మహిళ గురువారం సాయంత్రం శవమై కనిపించింది. ఈ ఘటనకు సంబంధించి మల్కాపురం పోలీసులు తెలిపిన వివరాలు.. మధ్య ప్రదేశ్ ప్రాంతానికి చెందిన అంబదాస్ కమల(65) స్థానిక నేవల్ క్వార్టర్‌లో ఓ కమోడోర్ ఇంట్లో పని చేస్తుంది. ఈమె కమోడోర్ ఇంటికి సమీపంలో నేవల్ సర్వెంట్ క్వార్టర్‌లో నివాసం ఉంటుంది. అయితే కమోడోర్ తల్లి హైదరాబాద్ వెళ్లడంతో కమల తన సర్వెంట్ క్వార్టర్‌లో ఉంటుంది. ఈమె మూడు రోజుల నుంచి తలుపు వేసుకుని,టీవీ ఆన్ చేసుకుని ఉంది. టీవీ సౌండ్ వింటున్న సర్వెంట్ క్వార్టర్ వాసులు కమల ఇంట్లో ఉందని అనుకున్నారు. అయితే మూడు రోజులు గడుస్తున్నా ఆమె తలుపు తీయకపోవడంతో అనుమానం వచ్చిన ఇతర సర్వెంట్ క్వార్టర్ వాసులు కమల పని చేస్తున్న వారికి ఫోన్‌లో సమాచారం అందించారు. వారు గురువారం సాయంత్రం అక్కడకు వచ్చి మల్కాపురం పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఏసీపీ కాళిదాస్,సీఐ విద్యాసాగర్ తదితర సిబ్బంది ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. శరీరంపై టవల్ తప్పా మరే వస్త్రాలు లేకుండా గదిలో కమల పడి ఉండడాన్ని పోలీసులు గుర్తించారు. అయితే స్నానం చేసి గదిలోకి వస్తుండగా గుండె పోటు వచ్చి కుప్పకూలి ఉంటుందని భావిస్తున్నారు. మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. శవపరీక్ష తర్వాత పూర్తి వివరాలు వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు.

పాఠ్య పుస్తకం ఆవిష్కరణ

విశాఖ విద్య: ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం ఆధ్వర్యంలో తెలుగు , సంస్కృ అకాడమీ, ఇటీవలే రెగ్యులర్ బీఈడీ ఉపాధ్యాయ విద్యార్థులకు డీఎస్సీ ఉపాధ్యాయ పోటీ పరీక్షల కోసం వివిధ పుస్తకాలను ప్రచురించింది. ఇందులో భాగంగా ఆంధ్ర విశ్వవిద్యాలయ దూర విద్యా విభాగం సహాయ ఆచార్యుడు డా. కనకల జయరాం సహరచయితగా ఉన్న బీఈడీ తృతీయ సెమిస్టర్‌కు సంబంధించి ఆంగ్ల మాధ్యమ పాఠ్య పుస్తకాన్ని ఏయూవీసీ ఆచార్య శశిభూషణరావు గురువారం విడుదల చేశారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కిషోర్ బాబు, ఆచార్య నరసింహారావు, సంగీత దర్శకులు సాలూరి వాసురావు పాల్గొన్నారు.

ప్రజల సహకారంతోనే నేరాల నియంత్రణ

వెస్ట్ సబ్ డివిజన్ సీఐ శ్రీనివాసరావు



కార్యక్రమంలో పాల్గొన్న స్థానికులు, మహిళలు



సదస్సులో మాట్లాడుతున్న సీఐ శ్రీనివాసరావు

గోపాలపట్నం: ప్రజల సహకారంతోనే నేరాల నియంత్రణ సాధ్యపడుతుందని వెస్ట్ సబ్ డివిజన్ సీఐ నిమ్మకాయల శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ 91వ వార్డు గవర వీధి రామాలయం వద్ద నేరాల నియంత్రణపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. తొలుత వీడియో విజువల్స్‌ను ప్రదర్శించారు. నేరాలు ఏవిధంగా జరుగుతున్నాయో.. ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వీడియోల ద్వారా వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో తాళం వేసి ఉన్న ఇళ్లలో దొంగతనాలు జరుగుతున్నాయని తెలిపారు. ఇవి నిర్లక్ష్యం అవగాహన లోపం వల్లే జరుగుతున్నాయన్నారు. తాళం వేసి వెళ్లేవారు తెలిసిన వారిని కాపలా పెట్టు కోవాలని సూచించారు. లేదా పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. గ్రామాల్లో, అపార్ట్‌మెంట్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సచించారు. ఇంట్లో విలువైన బంగారు ఆభరణాలు ఉంచుకోరాదని తెలిపారు. అనుమానాస్పదంగా తిరిగే వ్యక్తుల గురించి పోలీసులకు సమాచారమివ్వాలని కోరారు. ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసినా.. మెసేజ్‌లు పంపినా ఆ లింకులు ఓపెన్ చేయవద్దని తెలిపారు. డిజిటల్ అరెస్ట్ అంటూ ఫోన్లు వస్తే పోలీసులకు సమాచారమివ్వాలన్నారు. కార్యక్రమంలో ఎయిర్‌పోర్టు జోన్ క్రైం ఎస్ఐ సుదర్శనరావు, గోపాలపట్నం ఎస్ఐ ప్రసాదరావు, నాయకులు మళ్ల అప్పారావు, దొడ్డి జగన్, శరగడం అరుణ్, పొలమర శెట్టి కోటేశ్వరరావు, మళ్ల కనకాజు, దొడ్డి కనకరావు తదితరులు పాల్గొన్నారు.

దర్జాగా కబ్జా!

- టీడీపీ నాయకుల అండతో ఆక్రమణలు
- చర్యలకు సిద్ధమైన ములగాడ రెవెన్యూ అధికారులు
- పట్టాల రద్దుకు కలెక్టర్‌కు నివేదిక



పట్టాల రద్దుకు సిఫార్సు చేసిన స్థలం ఇదే



కొండపై చదును చేసిన 300 గజాల స్థలం

మల్కాపురం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పారిశ్రామిక ప్రాంతంలో కబ్జాలు జోరుగా సాగుతున్నాయి. ఎవరు ప్రశ్నిస్తారన్న ధీమాతో ప్రభుత్వ స్థలం కనిపిస్తే చాలు పాగా వేస్తున్నారు. ఈ కబ్జాల వెనుక టీడీపీ నాయకులు ఉండటంతో సచివాలయ రెవెన్యూ అధికారులు కన్నెత్తి చూడడం లేదు. దీంతో పలువురు ఆక్రమణల వ్యవహారంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో చర్యలు తీసుకునేందుకు ములగాడ మండల రెవెన్యూ అధికారులు సిద్ధపడుతున్నారు.

ఇదీ పరిస్థితి

58వ వార్డు ఎదురవానిపాలెం సర్వే నెంబర్ 17 బై 1,17 బై 3లో స్థానికంగా నివసిస్తున్న ముగ్గురికి 96 గజాల చొప్పున 2016లో అప్పటి అధికారులు ఇంటి పట్టాలు అందజేశారు. అయితే వీరు ముగ్గురూ ప్రభుత్వ ఉద్యోగులు. కానీ తమకు ఎలాంటి ఆస్తి లేదని నాటి అధికారులకు అర్జీపెట్టడంతో పట్టాలు మంజూరు చేశారు. అయితే వారికి కేటాయించిన 96 గజాల కంటే అదనంగా మరో 50 గజాల చొప్పున ప్రభుత్వ స్థలాన్ని ఒక్కొక్కరు ఆక్రమించి ఇళ్ల నిర్మాణాలకు సిద్ధమయ్యారు. దీనిపై జిల్లా రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు వెళ్లడంతో వారు చర్యలు తీసుకోవాలని ములగాడ తహసీల్దార్ కార్యాలయానికి ఆదేశాలు జారీ చేశారు. దీంతో బుధవారం ఎదురవానిపాలెం గ్రామానికి వెళ్లి అక్కడ సర్వే నెంబర్ 17 బై 1,17 బై 3 ప్రభుత్వ భూమిలో నాడు పట్టాలు ఇచ్చిన వారు వారి పరిధిలో ఇంటి నిర్మాణం చేపడుతున్నారా లేదా అని పరిశీలించారు. అయితే వారు ఒక్కొక్కరు అదనంగా మరో 50 గజాల భూమిని ఆక్రమించారని నిర్ధారించారు. దీనికి తోడు వారు ప్రభుత్వ ఉద్యోగులు అని తెలుసుకుని పట్టాలు రద్దు చేయాలని ములగాడ రెవెన్యూ అధికారులు కలెక్టర్‌కు నివేదిక ఇచ్చారు.

59వ వార్డులో కొండ కబ్జా

59వ వార్డు నక్కవానిపాలెం కొండ ప్రాంతంలో సర్వే నెంబర్ 55లో ఓ వ్యక్తి కొండను తవ్వేస్తున్నాడు. సదరు వ్యక్తికి స్థానిక టీడీపీ నాయకుడు అండగా నిలబడడం విశేషం. కొండపై సర్వే నెంబర్ 55లో సుమారు 300 గజాల ప్రభుత్వ భూమిని ఆయన చదును చేశాడు. దీనిపై ఫిర్యాదు అందడంతో ములగాడ రెవెన్యూ అధికారి రమణ ఆ ప్రాంతానికి వెళ్లి కొండను చదును చేస్తున్న మిషన్‌తో పాటు సామగ్రి స్వాధీనం చేసుకున్నారు. హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు.ప్రభుత్వ భూమి ఎవరు ఆక్రమించినా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

డిమాండ్ లెటర్లు సరే... పీపీవో ఆర్డర్లు ఎప్పుడో?

స్టీల్ ప్లాంట్ రిటైర్డ్ ఉద్యోగులు ఎదురుచూపు



ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో ఎవరిని కదిపినా ప్రస్తుతం హయ్యర్ పెన్షన్ , వీఆర్ఎస్ అంశాలపైనే చర్చ సాగుతోంది. వీఆర్ఎస్ దరఖాస్తు ప్రక్రియ పూర్తయి తుది నిర్ణయం యాజమాన్యం చేతుల్లోకి వెళ్లింది. ఇక రెండో అంశం హయ్యర్ పెన్షన్. దీన్ని కొంతకాలం తొక్కిపెట్టిన పీఎఫ్ అధికారులు ఎట్టకేలకు హయ్యర్ పెన్షన్ డిమాండ్ లెటర్లు జారీ చేస్తున్నారు. ఇప్పటి వరకు సుమారు 5500 డిమాండ్ నోటీసులు వచ్చాయి. దీన్ని ఉద్యోగులు స్వాగతిస్తున్నారు.

- అయితే 16 నెలల కిందట సుమారు రూ. 410 కోట్లు జమ చేసిన ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులకు ఇంత వరకు పెన్షన్ పేమెంట్ ఆర్డర్ (పీపీవో) రాకపోవడంతో ఆందోళన వ్యక్తమవుతోంది. లక్షల్లో కట్టాలని డిమాండ్ నోటీసుల్లో పేర్కొంటున్నారు. అప్పో, సప్పో చేసి కట్టడానికి సన్నద్ధం అవుతున్నా .. మరోవైపు ఇంతకు ముందు డబ్బు కట్టిన వారికి పెన్షన్ ఆర్డర్ వస్తే చూద్దామనుకుంటున్నారు. వారికి పెన్షన్ ఎలా లెక్క కట్టారో అనే దాన్ని బట్టి ముందుకు వెళ్లాలని ఉద్యోగులు భావిస్తున్నారు. ఇప్పటికే నగదు జమ చేసిన వారికి పీపీవోలు జారీ చేయాలని ఉద్యోగులు కోరుతున్నారు.

సరోజినినాయుడు నారీ లోకానికి స్ఫూర్తి



మాట్లాడుతున్న ఆచార్య సీతామాణిక్యం

విశాఖ విద్య: విశిష్ట కవయిత్రి, స్వాతంత్ర్య సమరయోధురాలు సరోజిని నాయుడును స్ఫూర్తిగా తీసుకొని ప్రతీ మహిళా ముందుకు సాగాలని ఏయూ లా కాలేజీ ప్రిన్సిపాల్ ఆచార్య కే. సీతా మాణిక్యం అన్నారు. సరోజని నాయుడు జయంతిని డాక్టర్ దుర్గాబాయి దేశ్‌ముఖ్ సెంటర్ ఫర్ ఉమెన్స్ స్టడీస్, ఆంధ్రా యూనివర్సిటీతో కలిసి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కాలేజ్ ఆఫ్ లా హాల్లో గురువారం ఘనంగా నిర్వహించారు. లా ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. సీతా మాణిక్యం మాట్లాడుతూ బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న మొదటి మహిళల్లో సరోజిని నాయుడు ఒకరన్నారు. ప్రొఫెసర్ వి.రాజ్యలక్ష్మి, ప్రొఫెసర్ టి.నాగభూషణం, డాక్టర్ ఎల్‌వీకే ప్రసాద్, డాక్టర్ కె.పల్లవి, డాక్టర్, పి.ఉష, డాక్టర్ రవి, డాక్టర్ కల్యాణ్, డాక్టర్ సాంబశివరావు, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.